క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు



కంచె తొలగింపు తరువాత ఇలా..

నరసన్నపేట: మండల కేంద్రంలోని పాత జాతీయ రహదారిపై పైడితల్లి ఆలయానికి వెళ్లే మార్గంలో అవతార్ మెహర్‌బాబా మందిరం ఎదురుగా ఉన్న ప్రభుత్వ (రోడ్డు మార్జిన్) స్థలాన్ని ఆక్రమించుకోవడానికి కూటమి కార్యకర్తలు వేసిన పథకాన్ని పంచాయతీ అధికారులు అడ్డుకున్నారు. అక్రమంగా వేసిన కంచెను తొలగించారు. అనుమతి లేకుండా ప్రభుత్వ స్థలంలో పెట్టిన దుకాణాన్ని (బడ్డీ) తీసివేశారు. ఈ సందర్భంగా పంచాయతీ ఈఓ ద్రాక్షాయిని మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సోమవారం ఆక్రమణల పర్వంపై సాక్షిలో కథనం ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టారు.

దివ్యాంగులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి



కంద్రపేటలో సర్వే నిర్వహిస్తున్న న్యాయవాది అన్నంనాయుడు, తదితరులు

ఆమదాలవలస: దివ్యాంగులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని ఆమదాలవలస ప్యానల్ అడ్వకేట్, సీనియర్ న్యాయవాది తమ్మినేని అన్నంనాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ న్యాయ సాధికారత సంస్థ ఆదేశాల మేరకు పట్టణంలోని 10వ వార్డు మెట్టక్కివలస, పాత కంద్రపేటలో సోమవారం దివ్యాంగుల నిర్ధారణ సర్వే నిర్వహించారు. 80 ఇళ్లలో సర్వే చేపట్టి ఇద్దరు దివ్యాంగులు నాగళ్ల వైష్ణవి, నాగళ్ల జగతిని గుర్తించారు. వీరికి పూర్తి స్థాయిలో అంగవైకల్యం ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఎటువంటి పథకాలు రావడం లేదన్నారు. వీరికి అన్నివిధాలా సహకారం అందిస్తామన్నారు. వైద్య సిబ్బంది హెచ్.వి.భూలక్ష్మి ఏఎన్ఎంలు డి.ధనలక్ష్మి, ఐ.అనుపమ, అంగన్‌వాడీలు, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.


మోడల్ ప్రైమరీ పాఠశాల ఏర్పాటుకు చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

పొందూరు: ప్రాథమిక విద్యను మెరుగుపరిచేందుకు మోడల్ ప్రైమరీ పాఠశాలల ఏర్పాటుకు చర్యలు ప్రారంభమైయ్యాయని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కిల్లి ఉషారాణి అధ్యక్షతన నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో కచ్చితంగా ఐదుగురు ఉపాధ్యాయులు ఉంటారన్నారు. పొందూరులో 163/1 సర్వే నంబర్ సమస్య వారం రోజుల్లో పరిష్కారం అవుతుందన్నారు. ఎంపీడీఓ మన్మథరావు, మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

శ్రేయ మిశ్రాకు తిరుమలై అవార్డు



శ్రేయ మిశ్రాకు అవార్డును అందజేస్తున్న సినీ నటుడు ప్రసన్నకుమార్

పాతపట్నం: తూర్పుగోదావరి జిల్లా వాడపల్లి వేంకటేశ్వర ఆలయం ప్రాంగణంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్యంలో శ్రేయ మిశ్రా ప్రతిభ కనబరిచి తిరుమలై అవార్డు దక్కించుకుంది. పాతపట్నం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన జాతీయ అవార్డు గ్రహీత, దివ్యాంగురాలైన శ్రేయ మిశ్రా ప్లేటుపై ప్రదర్శించిన కూచిపూడి నృత్యానికి ప్రశంసల వర్షం కురిసింది. మిశ్రాకు సినీనటుడు ప్రసన్నకుమార్ అవార్డును ప్రదానం చేశారు. మిశ్రాను ఆలయ నిర్వాహకులు, నాట్యాచార్యులు అర్చన ఉషశ్రీ, ఆలయ కమిటీ సభ్యులు సత్కరించారు.

అభినందన

బూర్జ: మండలంలోని ఓ.వి.పేట ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు సోమవారం తెలియజేశారు. ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన బి.లేపాక్షి, జి.తనుశ్రీ, వై.కుశ్వంత్, నీరజను ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

రబీపైనే ఆశలు



తెలగవలస వద్ద ఏపుగా ఉన్న మొక్కజొన్న పంట



రావులవలస వద్ద కట్టెజనుము పంట

- ఇప్పటికీ కళ్లాల్లో ఖరీఫ్ ధాన్యం
- అందని ప్రభుత్వ సాయం

నరసన్నపేట: వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న నరసన్నపేట నియోజకవర్గంలోని ప్రజలు రబీ పంటలపైనే ఆశలు పెట్టుకున్నారు. ఖరీఫ్‌లో వరి అనంతరం రబీలో వివిధ పంటలను వేశారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం మొండి చేయి చూపించినా.. ఎన్నికల ముందు రైతు భరోసా కింద ఏడాదికి రూ.20 వేల పెట్టుబడి సహాయం ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి మాట తప్పింది. తమకు తెలిసిన వ్యవసాయాన్ని వదులుకోలేక, పొలాలను బీడు భూములుగా ఉంచలేక రబీ పంటలపైనే ఆసక్తి పెంచుకుంటున్నారు. రబీ పంటలతో అదనపు ఆదాయం వస్తుందనే ఆశతో చెరువులు, బోర్లు కింద వివిధ పంటలను వేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో రబీ పంటల విస్తీర్ణం ఈ ఏడాది పెరిగింది.

పెరిగిన చోడిసాగు..

చిరుధాన్యాలకు ప్రభుత్వం పోత్రాహం ఇస్తుండటంతో రాగి పంటపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్లో రాగికి డిమాండ్ ఉండటం, పెట్టుబడి అంతగా అవసరం లేక పోవడంతో చోడి వైపు మొగ్గు చూపుతున్నారు. కోవిడ్ తరువాత రాగి వినియోగం బాగా పెరిగింది. గతంలో సుగర్ ఉన్న వాళ్లే రాగి జావ తీసుకొనేవారు. ప్రస్తుతం అందరూ ఆరోగ్య రీత్యా రాగి జావను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం క్వింటా చోళ్ల ధర రూ.10 వేల వరకు పలుకుతోంది. ఎకరాకు సుమారు 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఖర్చులు పోనూ రూ.60 వేల వరకు నికర ఆదాయం వస్తుంది. నియోజకవర్గంలో 5,10 ఎకరాల్లో చోడి సాగు అవుతున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. కట్టెనుము కూడా ఆశాజనకంగా ఉంది.

నరసన్నపేట నియోజకవర్గంలో రబీ పంటల సాగు (ఎకరాలు) వివరాలు				
మండలం	నరసన్నపేట	పోలాకి	సారవకోట	జలుమూరు
సాగు విస్తీర్ణం	5750	7250	4730	7100

వరి, మొక్కజొన్నపై రైతుల ఆసక్తి..

వరి, మొక్కజొన్న పంటలపై రైతులు ఆసక్తిగా ఉన్నారు. చెరువులు, బోర్లు కింద వరిని అధికంగా వేయడంతో ఖరీఫ్‌ను తలపిస్తుంది. గత రబీలో పండిన ధాన్యానికి మంచి డిమాండ్ వచ్చింది. పచ్చి ధాన్యమే మిల్లర్లు పొలం వద్ద నుంచే కొనుగోలు చేసుకుని వెళ్లారు. చీడ, పీడలు కూడా అంతగా లేక పోవడంతో ఎకరాలకు 35 బస్తాల వరకు దిగుబడి సాధించారు. బస్తా ధాన్యం రూ.1,900 వరకు విక్రయించారు. ఇదే ఆశతో రబీలోనూ వరిని వేశారు. సన్న సరకాలతోపాటు సుగర్ లెస్ ధాన్యం రకాలను అధికంగా పండిస్తున్నారు. నరసన్నపేట మండలం కరగాం, కంబకాయ, అంప్లాం, నారాయణవలస, ఉర్లాం, రావులవలసలతో పాటు జలుమూరు, సారవకోట మండలాల్లో పలు గ్రామాల్లో వరిని 4880 ఎకరాల్లో వేశారు. మొక్కజొన్నపై కూడా రైతులు ఎక్కువగా ఆశలు పెట్టుకున్నారు. గత రబీలో ఎకరాకు రూ.30 వేల వరకు అదనపు ఆదాయాలన్ని మొక్కజొన్నలో పొందారు. ప్రైవేట్ వ్యాపారులు పోటీపడి మొక్కజొన్న గింజలను కొనుగోలు చేశారు. దిగుబడి కూడా బాగుండటంతో మంచి ఆదాయం పొందారు. ఈ రబీ సీజన్‌లో మొక్కజొన్నపై రైతులు మక్కువగా ఉన్నారు. 2,525 ఎకరాల్లో మొక్కజొన్న వేశారు.

సూచనలు చేస్తున్నాం



రబీ పంటలపై రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు చేస్తున్నాం. మొక్కజొన్న, చోడి వంటి ఆరుతడి పంటలు వేయాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. గతంతో పోల్చితే సన్‌ఫ్లవర్, చెరకు విస్తీర్ణం తగ్గింది. వరి పంట విస్తర్ణం పెరిగింది. తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులు వస్తున్నాయి.

– రవీంద్రభారతి, ఏడీ, నరసన్నపేట

విద్యారంగం నిర్వీర్యం

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ విద్యా రంగం నిర్వీర్యం అవుతోందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఎన్నికల ముందు మెగా డీఎస్సీ నిర్వహిస్తామని, నిరుద్యోగులకు నమ్మించి ఓట్లు వేయించుకున్న చంద్రబాబు అధికారం చేపట్టి తొమ్మిది నెలలు అవుతున్నా ఎందుకు మెగా డీఎస్సీ ప్రకటించలేదని ప్రశ్నించారు. పాఠశాలలను, స్కూల్ కాంప్లెక్స్‌లను కుదించారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయంతో గ్రామీణులకు నష్టం జరిగేలా ఉందన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పేరు మార్చి డొక్కా సీతమ్మ పేరు పెట్టిన చంద్రబాబు ఆ పేరుకు అప్రతిష్ట తీసుకువస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వంట చేస్తున్న 40 వేల మంది సహాయకులను తొలగించి, ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు పాలకులు కుట్ర పన్నారన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ఇచ్చిన తల్లికి వందనం పథకం ఎందుకు అమలు చేయటం లేదని నిలదీశారు. అమలు సాధ్యం కాని హామీలు ప్రకటించి ప్రజలను మోసం చేశారన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివే 8వ తరగతి విద్యార్థులకు ప్రతీ ఏడాది జగనన్న ట్యాబ్‌లు ఇచ్చేవారని గుర్తుచేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పరిపాలన చేసిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



ఎంపీడీఓకు జాబితాను అందజేస్తున్న అసోషియేషన్ నాయకులు

ఆమదాలవలస రూరల్: సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని ఆమదాలవలస ఎంపీడీఓ ఆర్.వెంకటరావు సూచించారు. ఆమదాలవలస మండలంలోని సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగుల యూనియన్ కార్యవర్గ ఎన్నికను సోమవారం నిర్వహించారు. సంబంధిత కాపీని ఎంపీడీఓకు అందజేశారు. యూనియన్ అధ్యక్షుడిగా చింతాడ శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీలుగా సువ్వారి వెంకటలక్ష్మి, మానుకొండ కాశేశ్వరరావు, కోశాధికారిగా మండ మనోహర్, ఆర్గనైజేషన్ కార్యదర్శిగా శ్రీకాంత్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా పేడాడ సంతోష్‌కుమార్, బలగ వాసుదేవరావు, దీపాల విజయ్‌కుమార్, బొడ్డేపల్లి శారద, ఎస్.రమ్య, దవళ శైలజ, టెక్నికల్ ఆర్గనైజర్లుగా ఎం.ప్రభాకరరావు, పిట్టా ఈశ్వరరావును ఎన్నుకున్నట్లు వారంతా తెలిపారు. ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా యూనియన్ పనిచేస్తుందన్నారు.

వంట ఏజెన్సీ సభ్యురాలి తొలగింపు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం వంట ఏజెన్సీ సభ్యురాలిగా పనిచేస్తున్న గేదెల అన్నపూర్ణను విధుల నుంచి తొలగించినట్లు హెచ్‌ఎం డీఎల్ నరసింహం సోమవారం తెలిపారు. ఈ నెల 10 తేదీన జిల్లా కలెక్టర్ పాఠశాలను సందర్శించారు. వంట గది నిర్వహణ బాగులేకపోవటంతోపాటు నాణ్యమైన వంట దినుసులు వాడకపోవడంపై ఏజెన్సీ సభ్యులపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు.

వంట ఏజెన్సీలో ఒకరిని తొలగించాలని హెచ్‌ఎంకు కలెకర్ట్ ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆ రోజు పనిచేసిన అన్నపూర్ణను తొలగించినట్లు హెచ్‌ఎం తెలిపారు.

కళ్లద్దాల పంపిణీ



సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఆమదాలవలస మండలం దూసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కంటి వైద్యాధికారి బి.వి.ఎం.ప్రసాదరావు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. పలు రకాల కంటి సమస్యలను గుర్తించి 20 మంది విద్యార్థులకు అద్దాలు అందించారు. హెచ్‌ఎం కత్తిరి రామకృష్ణారావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

- సరుబుజ్జిలి

ఎండిపోయినది



ఈ చిత్రం సరుబుజ్జిలి మండలంలోని తెలికిపెంట వద్ద ఎండిపోయిన వంశధార నది. ప్రస్తుతం వంశధార నదిలో నీరులేక మైదానాన్ని తలపిస్తోంది. వేసవి కాలం ప్రారంభంలోనే నీరు అడుగంటి పోవడంతో తాగునీటితోపాటు, ఇతర అవసరాలకు తీవ్ర ఇబ్బందులు తప్పవని నదీతీర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

- సరుబుజ్జిలి

వసతి గృహం తనిఖీ



వసతి గృహాల్లో సౌకర్యాలు, భోజన వసతి తదితర అంశాలపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు సోమవారం పరిశీలించారు. స్థానిక దేశవానిపేటలోని బీసీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. వసతి గృహంలో కిచెన్, బాతురూమ్‌లు, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. స్థానిక సబ్‌జైల్‌ను పరిశీలించారు. రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. జైల్ సౌకర్యాలపై ఆరా తీశారు.

- నరసన్నపేట

ప్రకృతి ఉత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన పంటలు ఎంతో ఆరోగ్యమని జిల్లా మోడల్ మేకర్ ట్రైనర్ లెవెల్–2 యూనిట్ ఇన్‌చార్జి ఎరుబోతు భాస్కరరావు అన్నారు. పొందూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కూరగాయలను, చిరుధాన్యాలను విక్రయించారు. కమ్యూనిటీ డిజిటల్ ఫెసిలిటేటర్ పి.మల్లేష్, బి.రవి, బి.హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

- పొందూరు

అంగన్‌వాడీల ధర్నా



బూర్జ: సీడీపీఓకు వినతిపత్రం అందజేస్తున్న అమ్మన్నాయుడు, అంగన్‌వాడీ కార్యకర్తలు

సారవకోట: తాము ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఆవరణలో అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. ప్రాజెక్టు పరిధిలోని సారవకోట, జలుమూరు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు, జిల్లా యూనియన్ నాయకురాలు సుదర్శనం, ప్రాజెక్టు నాయకులు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ధర్నా నిర్వహించారు. సీడీపీఓ విమలకుమారికి వర్కర్స్, హెల్పర్స్ యూనియ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.అనురాధ, కేవీ హేమలత ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఆమదాలవలసలో..

ఆమదాలవలస: పట్టణంలోని ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులతో కలిసి ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి పంచాది లతాదేవి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యాలయంలో సూపర్ వైజర్ లక్ష్మీబాయికి వినతిపత్రాన్ని అందజేశారు. వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: స్థానిక శివశంకర్ కాలనీ కూడలి సమీపంలో ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. సీడీపీఓ టి.విమలరాణికి యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. పాతపట్నం, మెళియాపుట్టి మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బూర్జలో..

బూర్జ: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా చేశారు. పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీఓ ఎస్.గీతకు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయుడు ఆధ్వర్యంలో అందజేశారు. యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

18న అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

హిరమండలం: మహిళా శిశు సంక్షేమశాఖ, విద్యాశాఖ సమన్వయంతో ఈ నెల 18వ తేదీ నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంఈఓ, కోర్స్ డైరెక్టర్ కె.రాంబాబు అన్నారు. సోమవారం హిరమండలం ఉన్నత పాఠశాలలో శిక్షణ కేంద్రాన్ని ఎంఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులను, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తామన్నారు. శిక్షణ ఆరు రోజులపాటు ఉంటుందన్నారు. సీఆర్పీలు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



సిరుసువాడలోని పాన్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ ఎండీ అమీర్ అలీ

కొత్తూరు: గ్రామాల్లో మద్యం బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎండీ అమీర్ అలీ హెచ్చరించారు. మండలంలోని సిరుసువాడ, దాశరదీపురం కూడలితోపాటు పలు గ్రామాల్లో సోమవారం తనిఖీలు నిర్వహించారు. షాపుల్లో మద్యంతోపాటు ఇతర మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మద్యాన్ని అక్రమంగా రవాణా చేసినా, అక్రమంగా నిల్వ చేసినా సహించేది లేదన్నారు. ఒడిశా నుంచి నాటుసారా అక్రమంగా తీసుకువచ్చి పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వేద గణితంపై అవగాహన ఉండాలి

నరసన్నపేట: పుస్తకాలు లేని రోజుల్లో వేద గణితానికి ఎంతో ప్రాధాన్యత ఉండేదని, దీనిపై అవగాహన చేసుకోవడం ద్వారా నేటి విద్యార్థులు గణితంలో మరింత పట్టు సాధించవచ్చని స్టీల్ ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగి పి.సత్యనారాయణ అన్నారు. సోమవారం నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రత్యేక ఉపన్యాసం చేస్తూ.. వేద గణితం ప్రాధాన్యం, ప్రస్తుత తరం విద్యార్థులకు దీని ఆవశ్యకతను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్, గణిత శాస్త్ర అధ్యాపకురాలు పవిత్ర, తెలుగు అధ్యాపకులు రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

రామాచార్యులు మృతికి సంతాపం



రామాచార్యులు (ఫైల్)

ఆమదాలవలస: ఏపీటీఎఫ్ పూర్వ జిల్లా కార్యదర్శి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు తమ్మినేని రామాచార్యులు (83) ఆమదాలవలస పట్టణంలోని కొత్తకోటవారి వీధిలో గల తన నివాసంలో సోమవారం అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం ఈయన విశ్వసాహితీ సేవా సంస్థ గౌరవ అధ్యక్షుడిగా ఉన్నారు. ఈయన మృతిపట్ల ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు భానుమూర్తి, ఉపాధ్యాయ సంఘ నాయకులు బొడ్డేపల్లి మోహన్‌రావు, బొడ్డేపల్లి జనార్దనరావు, పలువురు రిటైర్డ్ ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. రామాచార్యులుకు భార్య విజయలక్ష్మి, కుమారుడు ప్రసాద్, కుమార్తెలు అమరవాణి, అరుణ ఉన్నారు. రామాచార్యులు సోదరుడు కృష్ణారావు ఆదివారం మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

సంక్షిప్తంగా..

చట్టాలపై అవగాహన

పాతపట్నం: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ బి.లావణ్య అన్నారు. మండలంలోని రొంపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పోక్సో, విద్యా చట్టాలు, బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. మైనర్లు ద్విచక్రవాహనాలు నడపరాదన్నారు. హెచ్‌ఎం నల్ల కుమారస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

హిరమండలం: మేజర్ పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్‌కు బీజేపీ మండల అధ్యక్షుడు ఆర్.ఢిల్లేశ్వరరావు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఢిల్లేశ్వరరావు మట్లాడుతూ హిరమండలం మండల కేంద్రంలో రానున్న వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బోయిన ధర్మారావు, సూర్య ఉన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఆరుగురు విద్యార్థుల ఎంపిక

కొత్తూరు: మండలంలోని నాలుగు ప్రభుత్వ పాఠశాలల నుంచి ఆరుగురు విద్యార్థులు ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికయ్యారు. కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.స్వాతి, బి.శ్రీజన్య, ఎస్.రేష్మా, మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పాడి చరిష్మా, నివగాం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన మోనిషా, పొనుటూరు యూపీ పాఠశాలకు చెందిన పతివాడ హరిణి ఉన్నారు. పొనుటూరు నుంచి ఎంపికైన హరిణిని హెచ్‌ఎం గుర్రాల కృష్ణారావు, ఉపాధ్యాయులు కుదుమ తిరుమలరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

వరుసక్రమంలో నాట్లు వేయాలి

సారవకోట: చోడి (రాగి) పంట నాట్లు వరుస క్రమంలో వేసుకోవాలని వ్యవసాయాధికారి కె.సి.హెచ్.వెంకటరావు సూచించారు. సోమవారం మండలంలోని పద్మాపురం సమీపంలో గ్రామానికి చెందిన రైతు రావాడ మోహన్‌రావు పొలంలో గులి రాగి పంట వరుస క్రమంలో నాట్లు వేసే పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించారు. 12 నుంచి 15 రోజులు గల నారును వరుస క్రమంలో నాట్లు వేసుకోవడం వలన దిగుబడి బాగా వస్తుందన్నారు. సాధారణ రకం రాగి కంటే గులి రాగి ఎకరాకు రెండు, మూడు బస్తాలు అధిక దిగుబడి వస్తుందన్నారు.

వివరాలు నమోదు చేసుకోవాలి

ఎల్.ఎన్.పేట: సొంత భూములు కలిగిన రైతులు శాశ్వత గుర్తింపు నంబర్ కోసం వివరాలను నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి పైడి లతశ్రీ కోరారు. సోమవారం తన కార్యాలయంలో గ్రామ సచివాలయ వ్యవసాయ శాఖ సహాయకులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో రైతులతో సమావేశమై వారికి అవగాహన కల్పించి నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. రాయితీలు, వ్యవసాయ పరికరాలు పొందేందుకు, పంట దిగుబడులు విక్రయించేందుకు శాశ్వత గుర్తింపు సంఖ్య ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

మెళియాపుట్టి: మండలంలోని పెద్దలక్ష్మీపురం గ్రామదేవత పాలపోలమ్మ ఆలయ మొదటి వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. వేకువజామునుంచే పూజలు చేశారు. గ్రామదేవత ఘటాలను ఊరేగించారు. ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

శివరాత్రి విశిష్టత తెలియజేయాలి

జలుమూరు: శివరాత్రి విశిష్టత అందరికీ తెలియజేస్తున్నామని త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. సోమవారం రాణ, చిన్నదూగాం, పెద్ద దూగాం గ్రామల్లో ప్రచారం నిర్వహించారు.

నేడు మండల సమావేశం

బూర్జ: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కర్నేన దీప ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఎంపీడీఓ ఆర్.తిరుపతిరావు సోమవారం తెలియజేశారు. ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

వివాదాస్పద స్థల సమస్యకు పరిష్కారం



గోకర్ణపురంలో రైతుతో మాట్లాడుతున్న అధికారులు

మెళియాపుట్టి: మండలంలోని గోకర్ణపురం పంచాయతీలో వివాదాస్పద స్థల సమస్యను తహసీల్దార్ పాపారావు, ఎంపీడీఓ నరసింహప్రసాద్ పండా సోమవారం పరిష్కరించారు. గతకొన్నేళ్లుగా గోకర్ణపురం నుంచి సంతలక్ష్మీపురం తదితర గ్రామాలకు వెళ్లడానికి కంకర రహదారి నిర్మించారు. ప్రస్తుతం గోకర్ణపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జేసీబీతో రహదారి మధ్యలో తవ్వారు. రెవెన్యూ అధికారులకు అందిన సమాచారం మేరకు పరిశీలించారు. రెవెన్యూ రికార్డుల్లో ఆ భూమి జిరాయితీగా ఉన్నట్లు తెలిపారు. భూయజమానిని ఒప్పించి అదే స్థలంలో ఎప్పటిలాగే రహదారిగా వాడుకోవడానికి అవకాశం ఉండేలా చేశారు. కార్యదర్శి ఎర్రయ్య, సర్వేయర్ సవర ప్రియాంక, వీఆర్వో జామి సింహాచలం, సర్పంచ్ రవికుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.